అధ్వానంగా గ్రీన్‌పార్కు

- ఎక్కడపడితే అక్కడ చెత్త
- బోటింగ్, తాగునీటి సౌకర్యం కరువు
- అపరిశుభ్రంగా మరుగుదొడ్డి
- ఇబ్బందుల్లో సందర్శకులు



అంబేద్కర్ (సింగరేణి) గ్రీన్ పార్క్ ముఖద్వారం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కోల్ బెల్ట్ రహదారి పక్కన ఏర్పాటు చేసిన అంబేద్కర్ (సింగరేణి) గ్రీన్‌పార్కు నిర్వహణ అధ్వానంగా తయారైంది. ఎక్కడపడితే అక్కడ చెత్త దర్శనమి స్తోంది. కోతులు, విష పురుగుల సంచారం, ఆట వస్తువులు ఉన్నచోట కొన్నేళ్ల క్రితం పోసిన రాళ్ల ఇసుక కనిపిస్తున్నాయి. క్యాంటీన్, బోటింగ్, తాగునీటి, మరుగుదొడ్డి సౌకర్యాలు లేక సందర్శకులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఉన్నా మరుగుదొడ్డి అపరిశుభ్రంగా ఉంది. పార్కులో సేద తీరడానికి మంచిర్యాల నుంచే కాక చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు, విద్యార్థులు, కార్మిక కుటుంబాలు ఇక్కడకు వస్తున్నారు. యాజమాన్యం ఒక్కొక్కరి నుంచి రూ.10 చొప్పున వసూలు చేస్తుంది. ఈ పార్కులో విశాలమైన షెడ్లు లేక వారు అవస్థలు పడుతున్నారు.

గతంలో..

సింగరేణి యాజమాన్యం పార్కు ఏర్పాటు చేయక ముందు ఆ ప్రాంతంలో కట్టె కోత మిషన్ (టింబర్ యార్డు) ఉండేది. మందమర్రి ఏరియాలో ఒక్కొక్కటిగా గనులు తగ్గిపోవడం వల్ల టింబర్ యార్డు ఎత్తివేసి ఆ చోట కార్మిక కుటుంబాలు సేదతీరడానికి 15 ఏళ్ల క్రితం గ్రీన్ పార్క్ ఏర్పాటు చేసింది. ఆకర్షణీయమైన పలు జంతువుల బొమ్మలను తయారు చేసి


అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్డి

నెలకొల్పారు. అందమైన పూల మొక్కలు, గులాబీ తోట, బోటింగ్‌ను పార్కులో ఏర్పాటు చేశారు. అప్పటి జీఎంలు, పర్యావరణ, అటవీశాఖ అధికారులు ప్రత్యేక సమయం కేటాయించి కుటుంబ సభ్యులతో పర్యవేక్షించి సుందరంగా, పరిశుభ్రంగా ఉంచేవాళ్లు. దాంతో పట్టణ ప్రజలు, కార్మిక కుటుంబాలతో పార్కు కిటకిటలాడేది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పార్కును సందర్శించి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పిస్తాం



అంబేద్కర్ (సింగరేణి)గ్రీన్ పార్క్‌లో కావల్సిన సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తా. మరుగుదొడ్డి సౌకర్యం ఉంది కొంచెం శుభ్రం చేయాల్సి ఉంది. పార్క్‌లో పంపులు ఉదయం సాయంత్రం నీటి సరఫరా ఉంటుంది. కొత్త హంగులతో పూర్వవైభవం తీసుకువస్తాం.
– చింతల శ్రీనివాస్, ఏరియా జీఎం

విద్యతోనే సమాజంలో గుర్తింపు


బెల్లంపల్లిరూరల్‌: మాట్లాడుతున్న ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి



లక్సెట్టిపేట: నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బెల్లంపల్లిరూరల్: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎంఈవో పి.మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గురుకుల బాలుర విద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థుల ఫేర్‌వెల్ డేకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకుని ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు బి.శ్రీనివాస్, ఐనాల సైదులు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలువురిని శాలువాలు, మెమోంటోలతో సన్మానించారు.

సరస్వతిదేవి విగ్రహ ప్రతిష్ఠాపన..

గురుకుల బాలుర విద్యాలయంలో పండితుల వేద మంత్రోర్చణల మధ్య చదువుల తల్లి సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. చండీహోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా మొక్కు చెల్లించుకున్నారు. కాసిపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ శారద, లంబాడితండా సర్పంచ్ రాయమల్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేటలో..

లక్సెట్టిపేట: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికలు) విద్యాలయంలో పదో తరగతి, ఇంటర్మీడియేట్ సెకండియర్ విద్యార్థినులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లలిత కుమారి మాట్లాడుతూ విద్యార్థినులు బాగా చదివి ప్రయోజకులు కావాలన్నారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. వైస్ ప్రిన్సిపాల్ మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో..

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శుక్రవారం పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ముఖ్య అతిథిగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య హాజరై మాట్లాడారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికావొద్దన్నారు. ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

క్లుప్తంగా

గొల్లపల్లి కార్యదర్శికి సన్మానం


రంజిత్‌ను సన్మానిస్తున్న పాలకవర్గం

నెన్నెల: మండలంలోని గొల్లపల్లి గ్రామ కార్యదర్శి రంజిత్‌ను పంచాయతీ పాలకవర్గం శుక్రవారం శాలువాలు కప్పి సన్మానించింది. గ్రామ పంచాయతీ జాతీయస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా నామినేట్ అయ్యేందుకు ఆయన చాలా కృషి చేశారని సర్పంచ్ ఇందూరి శశికళ కొనియాడారు. ఈ సందర్భంగా అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించి తీర్మానాలు చేశారు. ఉప సర్పంచ్ నారాయణ, వార్డు సభ్యులు గంగమల్లు, ఉమాదేవి, శ్రీనివాస్, ప్రమోద్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందూరి రమేశ్, అంగన్‌వాడీ కార్యకర్తలు రాజమణి, సుజాత, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్


నియామకపత్రం అందుకుంటున్న వెంకటేశ్

లక్సెట్టిపేట: మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షుడిగా శాంతాపూర్ గ్రామానికి చెందిన లింగంపల్లి వెంకటేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలక రాజనర్సు శుక్రవారం అతనికి నియామకపత్రం అందించారు. తనపై నమ్మకంతో పదవి బాధ్యతలు అప్పగించిన నాయకులకు వెంకటేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

అతిథి అధ్యాపకుల పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

లక్సెట్టిపేట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఫిజిక్స్ సబ్జెక్ట్ బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టు కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా. జైకిషన్ ఓ ప్రకటనలో తెలిపారు. కనీసం 55 శాతం మార్కులతో ఫిజిక్స్ సబ్జెక్ట్‌లో పీజీ పూర్తి చేసినవారు అర్హులని పేర్కొన్నారు. పీహెచ్‌డీ, నెట్/సెట్‌లో పని అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 14న సాయంత్రం 4 గంటల్లోగా కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. ఈనెల 15న డెమో, ఇంటర్వ్యూలు ఉంటాయని, తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

యువత సమస్యలపై పోరాటం చేస్తాం


మాట్లాడుతున్న నాయకులు

కోటపల్లి: దేశ వ్యాప్తంగా యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ముందుండి పోరాటం చేస్తామని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అరిగెల మహేశ్ అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శి మహేశ్, జిల్లా కమిటీ సభ్యుడు ప్రేంకుమార్ మాట్లాడారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగం హక్కుల కోసం పోరాడుతుందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరుద్యోగ సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

నూతన కమిటీ ఎన్నిక

15 మందితో డీవైఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పవన్‌కల్యాణ్, ఉపాధ్యక్షులుగా అనిల్, శ్రావణ్, రాజేశ్ మండల కార్యదర్శిగా రాజశేఖర్, సహాయ కార్యదర్శులుగా లక్ష్మణ్, స్వామి, సంతోశ్ ఎన్నుకున్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి


మాట్లాడుతున్న ఏవో మహేందర్

కోటపల్లి: ఎరువుల వినియోగంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏవో మహేందర్ సూచించారు. సిర్సా రైతువేదికలో ఏవో మహేందర్ ఆధ్వర్యంలో వరిలో ఎరువులు ఏ మోతాదులో దఫాలుగా వాడటంపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. పీక పురుగు నివారణకు తీసుకోవల్సిన సలహాలు, సూచనలు రైతులకు వివరించారు. ఆయిల్ ఫాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచులు పెద్దింటి పున్నంచంద్, రాజు, ఏఈవో అనూష, రాజు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకు నివాళి


చెన్నూర్‌లో సావిత్రీబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

చెన్నూర్: దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే మహిళా విద్యా విధానానికి అంకురార్పణ చేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చన రాంలాల్‌గిల్డా అన్నారు. పట్టణంలో మహాత్మా జ్యోతిబాపూలే యువజన సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే వర్ధంతని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి చైర్‌పర్సన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువజన సంఘం అధ్యక్షుడు తాటికొండ సురేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు నాయిని సతీశ్, మహేందర్ పాల్గొన్నారు.

మంచిర్యాలఅర్బన్: పాత మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: మహిళా విద్యకు పెద్దపీట వేసిన మహనీయురాలు సావిత్రీబాయి పూలే అందరికీ ఆదర్శమని తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గాండ్లతేలికుల సంఘం కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు వైద్య భాస్కర్, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి లక్ష్మణ్, సీనియర్ నాయకులు వైద్య రవి, జక్కుల రాజు పాల్గొన్నారు.


జిల్లాకేంద్రంలో నివాళులర్పిస్తున్న తెలంగాణ బీసీ జాగృతి నాయకులు


లక్సెట్టిపేట: నివాళులర్పిస్తున్న నాయకులు

లక్సెట్టిపేట: పట్టణంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు దొంత నర్సయ్య, కౌన్సిలర్ చాత రాజు రాజన్న, జిల్లా నాయకుడు శనిగారం లింగన్న, నాయకులు చుంచు రమేశ్, లింగంపల్లి వెంకటేశ్, పట్టణ నాయకులు శనిగారపు నరేశ్, దేవీభూమయ్య, అవును రెడ్డి, జనార్దన్, గోల్కొండ సత్తయ్య, రాందాస్, కిషన్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటితొట్లు

- కొన్ని గ్రామాల్లో ధ్వంసం
- దాహార్తికి అల్లాడుతున్న పశువులు


నెన్నెలలో నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి

నెన్నెల: మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నియోజకవర్గంలోని గ్రామాల్లో జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతో నీటితొట్లు నిర్మించింది. వేసవిలో పశువులకు నీటితొట్లను కల్పించాలనే లక్ష్యంతో నిర్మించగా వాటి నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా మారాయి. పంచాయతీల ఆధ్వర్యంలో కొనసాగే మోటారు బావుల నుంచి పశువుల నీటితొట్లకు నీటిని సరఫరా చేయాల్సి ఉండగా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. నోరు తెరిచి అడగలేని పశువులు దాహం తీర్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నాయి. కొన్ని గ్రామాల్లో చుట్టూ ధ్వంసమై శిథిలావస్థకు చేరాయి. పశువులకు దాహం వేస్తే కిలోమీటర్ల దూరంలో ఉన్న చెరువులు, కుంటలే వాటికి దిక్కు అవుతున్నాయి.

అధికారులు దృష్టిపెట్టాలి

ప్రభుత్వం పశువుల సంరక్షణకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నప్పటికి సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో అవి నీరుగారుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటల్లోని నీరు ఎండకు అడుగంటిపోతున్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన తొట్లు వృథాగా వదిలేయడంతో పశువుల దాహార్తి తీరక ప్రజల ధనం వృథాగా మారుతుందని ప్రజలు వాపోతున్నారు.

నీరందక ఇబ్బందులు

గ్రామాల్లో గొర్రెలు, మేకలు, పశువులు, ఇతర జీవాల కాపర్లు నీటితొట్లపై ఆధారపడుతున్నారు. వ్యవసాయ పొలాల వద్ద నీరు అందుబాటులో ఉండదు. ప్రస్తుతం ఎండతీవ్రత పెరుగుతుండటంతో నీటిమట్టం తగ్గుతోంది. పశువులకు నీటితొట్ల ద్వారా నీరందించాలని పాడైపోయిన నీటి తొట్లకు మరమ్మతు చేయాలని పెంపకందారులు కోరుతున్నారు.

వినియోగంలోకి తెస్తాం



గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న నీటితొట్లను పరిశీలించి పశువుల దాహార్తిని తీర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఎండలు ముదురుతున్న తరుణంలో నిరుపయోగంగా ఉన్న వాటి వద్ద నీటి సౌకర్యం కల్పించి వినియోగంలోకి తెస్తాం.
– శ్రీనివాస్, ఎంపీవో, నెన్నెల

ఎమ్మెల్సీ కవిత నిరసన దీక్షకు మద్దతు

పాతమంచిర్యాల: మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టాలని శుక్రవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత చేపట్టిన నిరసన దీక్షకు బీసీసంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేతతో కలిసి బీసీ సంఘం జాతీయ నాయకులు తోట శ్రీనివాస్ పటేల్, ఆకుల స్వామి, వివేక్‌పటేల్, తెలంగాణ మహిళాభివృద్ధి సంస్థ చైర్మన్ ఆకుల లలిత కలిసి జాతీయ చిహ్నం నాలుగుసింహాల రాజముద్ర గుర్తును కవితకు బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ బిల్లు పెట్టాలని చేపట్టిన కవిత దీక్షకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని తెలిపారు.



కవితకు నాలుగు సింహాల రాజముద్ర గుర్తును బహూకరిస్తున్న తోట శ్రీనివాస్ పటేల్ తదితరులు

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి


ఇంకుడు గుంత పరిశీలిస్తున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్: మండలంలోని గ్రామాలను స్వచ్ఛగ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ రాజేందర్ అన్నారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా మండలంలోని లింగాపూర్‌లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరించారు. అనంతరం గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇంకా చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత మరుగుదొడ్లు ఉపయోగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఇళ్లల్లోని తడి,పొడి చెత్తను డంపింగ్ యార్డులకు తరలించి వేర్వేరుగా ఉంచి సేంద్రియ ఎరువు తయారీ చేసే పద్ధతిని వివరించారు. పలు అంశాలపై కార్యదర్శులకు, వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో రాజేందర్, ఎంపీవో శ్రీనివాస్, ట్రైనర్ మల్లేశ్, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ


విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ నవాజొద్దీన్

చెన్నూర్: పట్టణంలోని కేజీబీవీలో పది, ఇంటర్ చదువుతున్న 130 మంది విద్యార్థులకు బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజొద్దీన్ శుక్రవారం పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నవాజొద్దీన్ మాట్లాడుతూ వార్షిక పరీక్షల్లో విద్యార్థులు సత్తా చాటి పాఠశాల, కళాశాలకు పేరు తీసుకురావాలన్నారు. పాఠశాల ప్రత్యేకాధికారి సుమలత, బీఆర్ఎస్ నాయకులు రాంలాల్‌గిల్డా, కారెంగుల శ్రావణ్, తాటికొండ సురేశ్, సీఆర్పీ పుప్పాల ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగిన గడపగడపకూ కాంగ్రెస్

రామకృష్ణాపూర్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన గడపగడపకూ కార్యక్రమం శుక్రవారం పట్టణంలోని బీజోన్ శాంతినగర్‌లో కొనసాగింది. ఇంటింటికి వెళ్తూ కాంగ్రెస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు నూకల రమేశ్, పల్లె రాజు, నోముల ఉపేందర్, మాజాహిద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

జైపూర్: తన పేరుపై ఉన్న భూమి పట్టా రద్దు చేయాలని ఇందారం గ్రామానికి చెందిన రేగుంట రాకేశ్ తహసీల్దార్ మోహన్‌రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందారానికి చెందిన రేగుంట లచ్చయ్య అలియాస్ దుబ్బగూడెం లచ్చయ్యది ఇంటి భూమి ఇదే గ్రామానికి చెందిన రేగుంట లచ్చయ్య గారి పేరిట ధరణిలో ఆన్‌లైన్‌లో పట్టాదారుగా తప్పుగా నమోదైనట్లు తెలిపారు. ఈ విషయమై లచ్చయ్య సంప్రదించగా ఆన్‌లైన్‌లో తండ్రి పేర్లు తప్పుగా నమోదు కాగా, ఆ భూమి మీకు తిరిగి పట్టా చేయడం కో సం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపాడు.

వార్డుల్లో మౌలిక వసతులు కల్పించాలి


స్థానికులతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

నస్పూర్: పట్టణంలోని పలు వార్డుల్లో మౌలిక వసతులు కల్పించాలని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పేర్కొన్నారు. హాథ్ సే హాథ్ జోడోయాత్రలో భాగంగా పట్టణంలోని 1వ వార్డు సుందరయ్య కాలనీలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వార్డుల్లో ఎక్కడ చూసిన చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన రావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. డ్రెయిన్లు సరిగ్గా లేవన్నారు. పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సురిమిల్ల వేణు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత, కౌన్సిలర్ శీపతి సుమతి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, నాయకులు భీంరవి, నక్క రాజేశ్వరి, నరిగె నరేశ్, దారవేణ తిరుపతి, తెనుగు దేవేందర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాకేంద్రంలో టౌన్–2, టౌన్–3 పరిధిలో విద్యుత్ మరమ్మత్తు కారణంగా సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని ఏఈ, జాన్, నర్సయ్య తెలిపారు. రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్ మరమ్మతు కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. మార్కెట్ ఏరియా, జన్మభూమినగర్, ఇస్లాంపూర, గౌతమినగర్, హైటెక్‌సిటీకాలనీ, లక్ష్మీనగర్, శుభాష్‌రోడ్, ఎంసీసీ ఏరియా, అండాలమ్మకాలనీ, మారుతినగర్, గ్రీన్‌సిటీ, రాజీవ్‌నగర్, భగత్‌నగర్, ఆశోక్‌రోడ్, దొరగారిపల్లి, మజీద్ వాడ కాలనీల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

మందమర్రిరూరల్: అందుగులపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తు కారణంగా పట్టణంలోని జీఎం ఆఫీస్ ఏరియా, యాపల్, కేకే–2 ఏరియా, మార్కెట్, దీపక్‌నగర్, పులిమడుగు, అందుగులపేట, కోటేశ్వరరావుపల్లె, బొక్కలగుట్ట ప్రాంతాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఇంజినీర్ మల్లేశం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

కంటివెలుగు శిబిరం ప్రారంభం

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్‌లో శుక్రవారం కంటివెలుగు శిబిరాన్ని ఎంపీడీవో మల్లేశం ప్రారంభించారు. ఎంపీటీసీ మాలిక, వైద్యాధికారులు శరత్‌బాబు, పంచాయతీ కార్యదర్శి సుష్మా, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా హరిహరక్షేత్ర పంచమ వార్షికోత్సవం

మంచిర్యాలఅర్బన్: స్థానిక హైటెక్‌సిటీ హరిహర క్షేత్ర ఆలయ పంచమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి పూజా కార్యక్రమం బలిప్రదాన పూర్ణాహుతి, వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో జన్మదిన వేడుకలు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆనంద నిలయం వృద్ధాశ్రమంలో మంచిర్యాలకు చెందిన సదాంజలి జన్మదిన వేడుక జరుపుకొంది. వృద్ధులకు భోజనం ఏర్పాటు చేశారు. సొసైటీ జిల్లా కార్యదర్శి రవీందర్, 5వ వార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ, సదాంజలి తల్లిదండ్రులు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

'కార్మికులపై కక్షసాధింపు చర్యలు'

పాతమంచిర్యాల: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ శ్రీరాంపూర్ ఏరియాలోని క్వాలిటీ జీఎం అల్లి రాజేశ్వర్ కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ అన్నారు. జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. క్వాలిటీ జీఎం తన వద్ద పని చేస్తున్న డ్రైవర్‌ను విధుల నుంచి తొలగించడం, అది ప్రశ్నించిన తోటి కార్మికులు, కార్మిక నాయకులపై పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టిస్తున్నారన్నారు. వారిపై కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సురేశ్, రవి పాల్గొన్నారు.

స్నేహితుడి కూతురి పెళ్లికి సాయం

మందమర్రిరూరల్: స్నేహితుడి చనిపోయిన అతని కూతురి పెళ్లికి చిన్ననాటి మిత్రులు హాజరై సాయం అందించారు. మందమర్రి జెడ్పీహెచ్ఎస్ 1994–95 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థి జెల్లి సత్యనారాయణ గతంలో మృతిచెందారు. అతనితో చదివిన పూర్వ విద్యార్థులు రూ.45 వేలను సేకరించారు. అతని కుమార్తె రుచిత వివాహం పట్టణంలోని శ్రీకృష్ణ గార్డెన్‌లో శుక్రవారం జరగగా వారు హాజరై నగదు అందించి ఆశీర్వదించారు.

ఆర్థికసాయం అందజేత

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లికి చెందిన తాండ్ర సత్తయ్య–వనితల కూతరు వివాహానికి నడిపెల్లి ట్రస్టు చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు విజిత్‌రావు రూ.5 వేల ఆర్థికసాయాన్ని శుక్రవారం అందించారు వైస్ ఎంపీపీ అనిల్, మాజీ ఎంపీటీసీ నారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్నదానం

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో శుక్రవారం కార్తీక్ మహరాజ్ స్వామి భక్తులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మహారాష్ట్రలోని చెప్రాడ కార్తీక్ మహరాజ్‌స్వామి ఆలయానికి వెళ్లే భక్తులు ప్రతినెల 10న కన్నెపల్లిలో స్వామి చిత్రపటానికి పూజలు చేస్తుంటారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

చెన్నూర్‌రూరల్: సుద్దాలలో రూ.10 లక్షల నిధులతో శుక్రవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. సర్పంచ్ అర్చన, రవి, నాయకులు ఉన్నారు.